క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న చీలాపల్లి గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని చీలాపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రాయిని చిన్న విఠల్, గోపాల్, సంగయ్య, విఠల్, దుర్గయ్య, సాయిలు, కుమార్, సాయిరెడ్డి, భూంరెడ్డి, వేణు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళి, సర్పంచ్ ప్రకాశ్, ఎంపీటీసీ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగరాజు, పార్టీ పరిశీలకులు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు యాదగిరి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షీ టీమ్స్‌పై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్పీ ఆదేశాలతో మెదక్ పోలీస్ శాఖ మేలుకొలుపు కళాబృందం వారితో షీ టీమ్స్ పై అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు వంటి అంశాలపై విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్, మల్లయ్య, కళాబృందం సభ్యుడు సురేందర్, కళాశాల ప్రిన్సిపాల్ యతిరాజావల్లి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీకి రూ 1.10 కోట్ల రుణమాఫీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఏకైక పీఏసీఎస్(సొసైటీ) సోమక్కపేటలో రూ.99 వేల రుణాలకు సంబంధించి 199 మంది రైతులకు రూ. 1.10 కోట్ల రుణమాఫీ అయినట్టు సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, సీఈఓ పోచయ్య అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.25 వేల వరకు 96 మంది రైతులకు రూ. 15.4 లక్షల రుణమాఫీ వచ్చిందని, అదేవిధంగా రూ. 50 వేల వరకు 167 మంది రైతులకు రూ.60.7 లక్షల రుణమాఫీ జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రామాయంపేట(మెదక్): రామాయంపేట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. నార్సింగికి చెందిన శ్రీకాంత్, శేఖర్, ప్రవీణ్ బైక్‌పై నార్సింగివైపు వెళ్తుండగా, వెనక నుంచి డీసీఎం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

రామాయంపేట(మెదక్): ప్రధాని మోదీ విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని స్వర్ణకారుల సంఘం సభ్యులు శుక్రవారం ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజ దామోదర్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసచారి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులకు అడ్మిషన్లు



విద్యార్థులకు అడ్మిషన్ ఇప్పిస్తున్న మమత

కౌడిపల్లి(నర్సాపూర్): చదువు మానేసి కూలీపనులకు వెళ్తున్న డ్రాపౌట్ విద్యార్థులకు కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలింగ్ ఇచ్చి, శుక్రవారం కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించారు. చిలప్‌చెడ్ మండలం బట్టుతండా పంచాయతీకి చెందిన ఇద్దరు విద్యార్థులు గత ఏడాది పదో తరగతి పూర్తిచేసి, కూలీపనులు చేసుకుంటున్నారు.



రామాయంపేటలో పాపన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



పెద్దశంకరంపేటలో..



కొల్చారంలో..

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు చేపట్టి ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయా పార్టీలు, గౌడ సంఘం నాయకులు



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో..



వెల్దుర్తిలో ..



కౌడిపల్లిలో ..



నర్సాపూర్ రూరల్: కాజీపేటలో..



శివ్వంపేటలో..

ఇష్టం లేకపోతే వెళ్లిపొండి

- క్రాంతికి టికెట్ రావడం.. గెలవడం పక్కా
- సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బుచ్చయ్య

రేగోడ్(మెదక్): ఇష్టం లేకపోతే బీఆర్‌ఎస్ పార్టీలో నుంచి వెళ్లిపోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఎంపీటీసీ నర్సింలు అన్నారు. దామోదర్‌కు కోవర్టులుగా ఉంటూ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు టికెట్ వద్దంటూ చెప్పడంపై బీఆర్‌ఎస్ అసంతృప్తి నేతలపై మండిపడ్డారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... క్రాంతికిరణ్‌కు టికెట్ రావడం, గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేగోడ్ మాజీ ఎంపీటీసీ నరేందర్, సింగూర్ సంగన్న, యూసూబ్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు రాజేందర్ పాటిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్ తదితరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో క్రాంతికిరణ్ కృషితో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు రాజేందర్‌పాటిల్ వంటి నేతలను పార్టీ ఎంతో గౌరవించినా.. పార్టీకి దూరంగా ఉంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్, సర్పంచ్‌లు నర్సింలు, తుక్కారాం నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ చైర్మన్ రాధకిషన్, బాలయ్య, సురేందర్, కృష్ణమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందరికి ఇవ్వాలి



మెదక్: రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు



నర్సాపూర్‌లో బీజేపీ నాయకుల రాస్తారోకో

మెదక్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పార్టీలకతీతంగా అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణంలోని మార్కెట్ కమిటీ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో వాహనాలు భారీగా నిలిచి పోయాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు వారి కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బలవంతంగా నాయకులను లాక్కెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్, నాయిని ప్రసాద్, నల్లాల విజయ్, నందు జనార్దన్‌రెడ్డి, పంజా విజయ్‌కుమార్, బెండ వీణ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ ఆరోపించారు. పార్టీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక చౌరస్తాలో పార్టీ నాయకులతో కలిసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని, సొంత ఇల్లు లేని వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ఇతర హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో మల్లేశ్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్ రాజేందర్, బాల్‌రాజ్, శంకర్, అనిల్, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్‌ఐ శివకుమార్ తన సిబ్బందితో వచ్చి మల్లేశ్‌గౌడ్, రాజేందర్‌లను అరెస్టు చేసి, తీసుకుపోగానే మిగిలిన నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత




రోడ్డుపై గుంతలు పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్ - నర్సాపూర్ రహదారిపై ఉసిరికపల్లి గేట్ సమీపంలోని బ్రిడ్జిపైన గుంతలు పడ్డాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో రోడ్డుపై గుంతలు అవస్థల్లో ప్రయాణికులు అనే శీర్షికతో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన హైవే అధికారులు, ఏఈ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్యాచ్ వర్క్ నిర్వహించి గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, వాహనదారులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

కలెక్టరేట్‌లో పూడ్చిన పగుళ్లు



సాక్షి ఎఫెక్ట్..

మెదక్: మెదక్ నూతన కలెక్టరేట్ నిర్మాణాలు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. అందులో 60 శాఖలకు సంబంధించి వందకు పైగా గదులను నిర్మిస్తున్నారు. కాగా ఇందులో పలు శాఖల పరిధిలోని గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ విషయం ఈనెల 17న సాక్షి దినపత్రికలో 'ప్రారంభానికి ముందే పగుళ్లు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఈ కథనానికి స్పందించిన అధికారులు లప్పంతో పగుళ్లను పూడ్చారు.

సస్యరక్షణతో పంటలు భద్రం

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంటసాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంటలు భద్రంగా ఉండడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్, శీలాంపల్లి గ్రామంలో పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి పంటలో తామర పురుగు ఉధృతి పరిశీలించామని, ఈ పురుగులు ఆకుల రసాన్ని పీల్చడం ద్వారా ఆకులు ముడుచుకొని పెలుసుగా మారుతాయన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.25 ఎంఎల్, లేదా పిప్రోనిల్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు చేతులకు గ్లౌస్ వేసుకోవడంతో పాటు, ముఖానికి మాస్క్ ధరించాలన్నారు. ఏఈఓ భూపాల్, మండల రైతు సమన్వయకర్త రాజిరెడ్డి, రైతులు దుర్గారెడ్డి, మహేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా హరితహారం



కౌడిపల్లి(నర్సాపూర్): మొక్కలు నాటే పనులు చేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నుంచి కౌడిపల్లి వరకు 765డీ జాతీయ రహదారికి ఇరువైపులు మొక్కలు నాటే పనులు ముమ్మరం చేశారు. శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శిలు, ఉపాధిహామీ అధికారులు ఈనెల 23న సీఎం కేసీఆర్ ఇటుగా మెదక్ వెళ్తుండటంతో అధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనులు చేశారు. రహదారికి ఇరువైపులు మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ ఏరివేతతో పాటు పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఎం పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు పనులు చేస్తున్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో శుక్రవారం మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ లద్ద ప్రీతి ఆధ్వర్యంలో 75 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేశ్, కార్యదర్శి ఆరీఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



హవేళీఘనపూర్(మెదక్): మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి

హవేళీఘనపూర్(మెదక్): ఈ నెల 23న మెదక్‌లో జరుగనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేలా కార్యకర్తలు చూడాలని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముత్తాయికోట గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ అనురాధకృష్ణ, ఎంపీటీసీ జ్యోతిప్రవీణ్, మాజీ సర్పంచ్ కిరణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): ఈనెల 23న జిల్లా కేంద్రం మెదక్‌లో జరిగే సీఎం బహిరంగ సభకు మండలం నుంచి 5 వేల మందిని తరలించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్‌గా మర్కూర్ ఎంపీపీ పాండుగౌడ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. జైన్ మందిర్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఎం బహిరంగ సభకు వచ్చే జనం బాగోగులు కార్యకర్తలు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ షాహెదల్లా దర్గాలో మండల ఇన్‌చార్జ్ జైపాల్‌నాయక్ సమక్షంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, మండల ప్రధాన కార్యదర్శి అవినాష్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు శ్వేత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విక్రమ్‌గౌడ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాజాగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెగుళ్లను సకాలంలో నివారించాలి



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

చేగుంట(తూప్రాన్): వరిలో కాండం తొలిచే పురుగును సకాలంలో నివారిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని రుక్మాపూర్‌లో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పంట మార్పిడి ద్వారా కాండం తొలిచే పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. సరైన మోతాదులో ఎరువులు వాడాలని, పంటల సాగులో అధికారుల సూచనలు పాటించాలని వివరించారు. ఆయనతో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, నరేందర్, రైతులు అంజిరెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై మొక్కల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జాతీయ రహదారి వెంట మొక్కలను శుక్రవారం అదనపు కలెక్టర్ రమేష్ , జెడ్పీ సీఈఓ శైలేష్ కుమార్ పరిశీలించారు. ఈ నెలలో సీఎం జిల్లా పర్యటన ఉండడంతో రోడ్డు వెంట మొక్కలు, పచ్చదనం, పరిశుభ్రతను తనిఖీ చేశారు. గతంలో సీఎం రహదారి మీదుగా వెళుతూ మొక్కలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కాగా మరోసారి అలా జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారితో సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, అధికారులు ఉన్నారు.

దళితబంధు నిలిపివేయాలి



టేక్మాల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీకి దళితబంధును నిలిపివేయాలని శుక్రవారం టేక్మాల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇస్తే అందరికీ ఇవ్వాలని.. లేదంటే పూర్తిగా నిలిపివేయాలని కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. గ్రామంలో 200 మంది దళిత కుటుంబాలు ఉంటే కొందరికే దళితబంధు ఇవ్వడం ఎంటని ప్రశ్నించారు. గ్రామంలో ఉన్న దళిత కుటుంబాలన్ని నిరుపేద కుటుంబ సభ్యులమేనన్నారు. తమకు న్యాయం చేయాలని, లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందరికీ వర్తించేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతులకు న్యాయం చేయాలి**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం శివారులోని 217 సర్వే నంబర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను అక్రమంగా తీసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో రైతులు తీవ్రమనోవేదనకు గురవుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసైన్డ్‌భూమి పోతుందనే బెంగతో రైతు డాగ్గారి నారాయణ గుండెపోటుతో మృతి చెందాడని, ఆయన మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, మంగళి కృష్ణ, అనిల్, కుమార్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

◆ **భూమిపూజ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం సర్పంచ్ రాజేందర్ భూమిపూజ చేశారు. గంగాగౌడ్, ప్రకాశ్, భూషణం, నాయకులు కిషన్, రమణ, బాగులు, రాములు, భిక్షపతి, రజక, అంబేడ్కర్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **అభివృద్ధి పనులు ప్రారంభం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో పల్లె దవాఖానా నిర్మాణానికి సర్పంచ్ నీరజగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్, ఏఈ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిలుక నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రయ్య, విజయ్‌రాజ్, భిక్షపతి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి**

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ బలోపేతం కోసం కార్యకర్తలు కృషిచేయాలని పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ ఎంపీటీసీల కార్యాలయాన్ని ఎంపీపీ భాగ్యలక్ష్మి, పీసీసీ సీనియర్ సభ్యుడు చౌదరి సుప్రభాతరావులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని కామారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తార్యనాయక్, గజగట్లపల్లి గ్రామానికి చెందిన నర్సాగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు.

◆ **నష్టపరిహారం అందజేత**

మనోహరాబాద్(తూప్రాన్): గత వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందజేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం పలు గ్రామాలకు చెందిన బాధితులకు రూ. 3,350 చొప్పున 41 మందికి నగదును అందజేశారన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, నాయకులు రమేశ్ తదితరులున్నారు.

◆ **కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కుష్టువ్యాధి నివారణకు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు వైద్యులు వికాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేసి, వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించారు. హెచ్‌ఈఓ యాదయ్య, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్ తదితరులున్నారు.

◆ **పశువుల రక్త నమూనాల సేకరణ**

వెల్దుర్తి(తూప్రాన్): పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకుంటుంది. టీకాలు వేసేముందు.. 28 రోజుల తర్వాత పశువుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు రక్త నమూనాలు సేకరిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అధికారి, ఏడీ పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి వెటర్నరీలో పశువుల రక్త నమూనాలు సేకరించారు. మండల పశువైద్యాధికారి లక్ష్మి, ఫజల్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **తూప్రాన్ తహసీల్దార్‌గా విజయలక్ష్మి**

తూప్రాన్: తూప్రాన్ తహసీల్దార్‌గా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా బోదన్ డివిజన్ పరిధిలోని పొతాంగల్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన విజయలక్ష్మి బదిలీపై తూప్రాన్‌కు వచ్చారు.

◆ **నియామకం**

రామాయంపేట(మెదక్): జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా రామాయంపేటకు చెందిన జహీరుద్దీన్ నియమితులయ్యారు. ఈమేరకు సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా జహీరుద్దీన్ వెంకట్‌రెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

కె. లక్ష్మణ్
9502735264